# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు.**
3. **ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రానికి 42 కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.**
4. **రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 ప్రధాన పరీక్షలు ఈ రోజు ప్రారంభమయ్యాయి.**
5. **పత్రికా స్వేచ్ఛపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుందని, ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగుపరుస్తుందని విశ్వసిస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవం చేసిన సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను అభినందిస్తున్నానని ప్రధానమంత్రి తెలిపారు.

--------------------------

రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రసార మాధ్యమాలకు ఆయన ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలుపారు.

--------------------------

ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రానికి 42 కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు జిల్లా వింజమూరులోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్‌ను.. శాసనసభ్యులు కాకర్ల సురేష్‌తో కలిసి ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

పత్రికా స్వేచ్ఛపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయులకు నివాళులు అర్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా మే 3వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించేందుకు, వారి హక్కులను కాపాడేందుకు, సమాజంలో అసత్య ప్రచారాలను బయటపెట్టేందుకు, నిజాయతీకి శబ్దాన్ని ఇచ్చేందుకు పాత్రికేయులు చేస్తున్న సేవ ఎనలేనిదని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిస్వార్థంగా శ్రమిస్తూ.. ఒత్తిడిని తట్టుకుంటూ నిజాలను నిర్భయంగా వెల్లడిస్తున్న పాత్రికేయులకు మంత్రి ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 ప్రధాన పరీక్షలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4 వేల 496 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. విజయవాడలోని బిషప్ అజారయ్య ప్రభుత్వ పాఠశాలలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్ పర్సన్ ఆర్.అనూరాధ, కార్యదర్శి రాజాబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రల చుట్టుపక్కల ఉన్న దేవాలయలు, మసీదులు, చర్చిలలో లౌడ్ స్పీకర్ వినియోగాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, నాలుగు జిల్లాల కలెక్టర్లు ఈ పరీక్షలను పర్యవేక్షిస్తారని రాజాబాబు వివరిస్తూ...

వాయిస్ ..31 సెకన్లు

---------------------------

ముంబయిలో జరిగిన వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్..వేవ్స్ 2025లో, క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్..సీఐసీ సీజన్ 1 నిన్న ముగిసింది. ఇందులో భాగంగా ఈ సీజన్‌లో యానిమేషన్, గేమింగ్, కృత్రిమ మేధతో ఫిల్మ్ మేకింగ్, సంగీతం, డిజిటల్ ఆర్ట్, ప్రసార మాధ్యమాలు, వినోద పరిశ్రమలోని ప్రతి డొమైన్‌కు విస్తరించిన 32 విభిన్నకార్యక్రమాల్లో విజేతలను సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. మొదటిసారిగా సృజనాత్మకతకు మాత్రమే అవార్డు ఇస్తున్నామని తెలిపారు. వేవ్స్ యువ మనసులు సృజనాత్మకతను సాంకేతికతతో ఎలా మిళితం చేస్తున్నాయో చెప్పడానికి ఈ వేదిక ఒక ఉదాహరణ అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ తెలిపారు.

---------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో కార్మికులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. న్యాయవారోత్సవాల్లో భాగంగా ఈ రోజు న్యాయవాదులు కార్మికులకు పీఎం శ్రమయోగి మన్ దన్ పథకం, ఆయుష్మాన్ భారత్, ఇ–శ్రమ్ పథకాల గురించి వివరించి.. పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. పీఎం శ్రమయోగి పథకం ద్వారా పదవీ విరమణ పొందిన తరువాత కూడా పెన్షన్ ను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇ–శ్రమ్ పథకం కింద ఉచితంగా కార్డులను అందిస్తారని.. ప్రమాదవశాత్తు మరణిస్తే 2లక్షలు, గాయపడితే లక్ష రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందని తిరుపతికి చెందిన న్యాయవాది రాజేశ్వరరావు వివరిస్తూ...

వాయిస్ ..36 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై భక్తులు తమ అభిప్రాయాన్ని వాట్సప్ ద్వారా సులభంగా తెలియజేయవచ్చు. తిరుమల, తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే వాట్సప్‌లో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ తెరుచుకుంటుంది. ఇక్కడ భక్తులు తమ పేరు నమోదు చేసి, టీటీడీ సేవలకు ఐచ్ఛికాలు ఎంచుకోవాలి. అనంతరం టెక్ట్స్ లేదా వీడియో ఫార్మాట్‌లో అభిప్రాయాలు తెలియజేయవచ్చు. భక్తుల అభిప్రాయాల ఆధారంగా సేవల ప్రమాణాన్ని పెంచేందుకు టీటీడీ చర్యలు తీసుకుంటుంది.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా మర్రిపూడిలో ఈ రోజు నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొని రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఫిర్యాదు పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 35 సెకన్లు....

=====================